## క్లుప్తంగా

### సీఐపై ఎస్పీకి ఫిర్యాదు

కాకినాడ క్రైం: సామర్లకోట కోట సీఐపై చంద్రంపాలెం గ్రామానికి చెందిన ఓ కుటుంబం జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్‌కు గురువారం రాత్రి ఫిర్యాదు చేసింది. బాధిత కుటుంబానికి చెందిన తూటే సునీల్‌కుమార్ మాట్లాడుతూ, కిరణ్‌కుమార్ అనే వ్యక్తికి తమకు మధ్య ఆస్తి తగాదాలు ఉన్నాయని పేర్కొన్నాడు. సివిల్ తగాదాలో సీఐ కృష్ణ భగవాన్ జోక్యం చేసుకున్నారని, కిరణ్‌కుమార్ చెప్పింది విని తనను స్టేషన్‌కు తీసుకువెళ్లి విచక్షణారహితంగా కొట్టారన్నారు. స్టేషన్ నుంచి బయటికి వెళ్లకుండా చేస్తానంటూ సీఐ తన కుటుంబ సభ్యుల ఎదుటే బెదిరించారన్నారు. ఫిర్యాదులో వాస్తవాలను నిర్ధారించుకునేందుకు సీఐ రూంలో ఉన్న కెమేరాలో బుధవారం మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సాయంత్రం 4 గంటల మధ్య రికార్డయిన సీసీటీవీ ఫుటేజీని పరిశీలించాలని ఎస్పీని కోరారు. రికార్డు అయిన ఫుటేజీని తమకు ఇచ్చి తమపై నమోదు చేసిన కేసు వివరాలు ఇవ్వాలని కోరారు. సీఐపై చర్యలు తీసుకోవాలని సునీల్‌కుమార్ కుటుంబం ఈ మేరకు ఎస్పీని కోరింది.

### పశువైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలి

కొత్తపల్లి: గ్రామాల్లో నిర్వహించే పశు ఆరోగ్య శిబిరాలను పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని పశువైద్యాధికారి శ్రీమన్నారాయణ అన్నారు. మండలంలోని వాకతిప్ప, నాగులపల్లిలో పశువైద్యాధికారి ఆధ్వర్యంలో పశు ఆరోగ్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశువులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులను ఉచితంగా అందించారు. అ సీజన్లో పశువులపై పాడి రైతులు తీసుకోవలసిన అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. పశువుల ఆరోగ్యానికి చికిత్స, ఉత్పాదకతను పెంచడానికి, చికిత్స వ్యాధులను నియంత్రించేందుకు టీకాలు, పశుపోషణ ఖర్చులు తగ్గించేందుకు చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు. ఎదకు రాని, చూడి కట్టని, గర్భకోశ వ్యాధులకు వైద్యులతో పరీక్షలు చేయడం జరుగుతుందన్నారు. మండలంలో నేడు ఎండపల్లి, ఇసుకపల్లిలో శిబిరాలు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

### నేడు తాండ్ర పాపారాయుడి వర్ధంతి

సామర్లకోట: బొబ్బిలి వీరుడు తాండ్రపాపారాయుడు 168వ వర్ధంతిని పురస్కరించుకొని వెలమ్మపేటలో శుక్రవారం దివ్యాంగులకు వస్త్ర దానం చేస్తున్నట్లు బ్రహ్మనాయుడు జిల్లా అధ్యక్షుడు, సీనియర్ వైఎస్సార్ సీపీ నాయకుడు ఆదపురెడ్డి శ్రీనివాసరావు తెలిపారు. గురువారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ దివంగత ఎమ్మెల్యే తోట గోపాలకృష్ణ ఆధ్వర్యంలో వెలమపేటలో తాండ్ర పాపారాయుడు విగ్రహాన్ని ఏర్పాటు చేసినట్టు తెలిపారు.

### బీజేపీ బలోపేతానికి కృషి

సామర్లకోట: జిల్లాలో బీజేపీ బలోపేతానికి కృషి చేస్తానని ఆ పార్టీ అధ్యక్షుడు బిక్కిన విశ్వేశ్వరరావు అన్నారు. గురువారం స్థానిక భారత మాతసేవా పరిషత్తు అధ్యక్షుడు గొరకపూడి చిన్నయ్యను ఆయన స్వగృహంలో మర్యాద పూర్వకంగా కలిసారు. ఈ మేరకు చిన్నయ్యదొర జిల్లా అధ్యక్షుడు బిక్కినను ఘనంగా సత్కరించారు. నియోజకవర్గంలో సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని బిక్కిన తెలిపారు.

### కొత్తపల్లి మండల అధికారులు

| | |
|---|---|
| తహసీల్దార్ | 91542 47464 |
| ఎంపీడీఓ | 94401 13090 |
| ఇంజినీర్ | 99890 78030 |
| ఎలక్ట్రికల్ ఏఈ | 94408 12642 |
| హౌసింగ్ ఏఈ | 70939 30455 |
| ఈఓపీఆర్డీ | 99489 27333 |
| ఉపాధి హామీ పథకం ఏపీఓ | 83744 46378 |
| డ్వాక్రా ఏపీఎం | 89788 81622 |
| ఎస్సై | 94409 00752 |
| సీఐ పిఠాపురం | 94407 96523 |
| వ్యవసాయ శాఖ ఏఓ | 83310 56594 |
| కొత్తపల్లి పీహెచ్‌సీ డాక్టర్ | 99890 69546 |
| నాగులపల్లి పీహెచ్‌సీ డాక్టర్ | 98497 28671 |
| కొమరగిరి పీహెచ్‌సీ డాక్టర్ | 92466 90633 |
| ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ | 89858 28380 |
| ఎంఈఓ | 92467 34465 |
| ఐసీడీఎస్ సీడీపీఓ | 94408 14692 |
| ఇరిగేషన్ జేఈ | 83310 75078 |

### సామర్లకోట అధికారుల ఫోన్ నంబర్లు

| | |
|---|---|
| **మున్సిపాలిటీ** | |
| మున్సిపల్ కమిషనర్ | 98499 05808 |
| మున్సిపల్ మేనేజర్ | 98499 07118 |
| మున్సిపల్ డీఈ | 96769 68282 |
| మున్సిపల్ ఏఈ | 98499 07122 |
| మున్సిపల్ ఆర్వో | 98499 07120 |
| మున్సిపల్ ఆర్ఐ | 90146 00920 |
| మున్సిపల్ టీపీఓ | 98499 07123 |
| శానిటరీ ఇన్‌స్పెక్టర్ | 77024 48282 |
| అకౌంట్స్ ఆఫీసర్ | 98499 02447 |
| **ప్రభుత్వాస్పత్రి** | |
| సూపరింటెండెంట్ | 80082 88125 |
| పశు సంవర్ధక శాఖ ఏడీ | 94418 60299 |
| తహసీల్దార్ | 98499 03876 |
| ఎంఈఓ-1 | 85558 71069 |
| ఎంఈఓ-2 | 94410 73418 |
| ట్రాన్స్‌కో ఏడీఈ | 94408 12600 |
| ట్రాన్స్‌కో ఏఈ | 94408 12634 |
| ట్రాన్స్‌కో ఏఈ రూరల్ | 94408 12686 |

# రోడ్డుపై రోడ్డు మళ్లీ మళ్లీ..!

- బాగున్నా మళ్లీ నిర్మాణ పనులు
- సత్యనారాయణపురం రహదారిపై ఎనిమిదేళ్లుగా గోతులతో సతమతం
- నిర్లక్ష్యం వహిస్తున్న అధికారులు



శుభ్రంగా ఉన్న మఠంసెంటర్-నిమ్మతోట సీసీ రోడ్డు



గోతులతో ఉన్న సత్యనారాయణపురం రహదారి

సామర్లకోట: ఎనిమిదేళ్లుగా గోతులతో ఉన్న రోడ్లపై దృష్టి పెట్టకుండా బాగున్న సీసీ రోడ్ల పైనే మళ్లీ సీసీ రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేయడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. స్థానిక స్టేషన్ సెంటర్ నుంచి సత్యనారాయణపురం వెళ్లే రహదారి ఎనిమిదేళ్లుగా గోతులమయంగా ఉంది. గత కౌన్సిల్ అధికారంలో ఉన్న సమయంలో మున్సిపాలిటీ పరిధిలో రోడ్ల మీదుగా గ్యాస్ పైపులైన్ల కోసం రోడ్లను తవ్వారు. ఈ మేరకు గ్యాస్ కంపెనీ నుంచి వచ్చిన నిధులతో ఆయా ప్రాంతాల్లో రహదారుల నిర్మాణం పూర్తి చేశారు. కానీ సత్యనారాయణపురం వెళ్లే రహదారిని మాత్రం విస్మరించారు. ఈ రోడ్డు మీదుగా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం, ప్రైవేటు కల్యాణ మండపం, ఎఫ్‌సీఐ గోదాములు, ఒక ప్రైవేటు కాన్వెంటుకు ప్రధాన మార్గం ఇది. ఫ్లైఓవర్ బ్రిడ్జి గోడ మార్జిన్‌లో ఉన్న రాళ్లు గుచ్చుకుని విద్యార్థులు చాలా అవస్థలు పడుతున్నారు.

**టెండర్ ఆమోదించి నిధుల మంజూరు**

మఠంసెంటర్ నుంచి నిమ్మతోట వరకు బాగున్న సిమెంటు రోడ్డుపై మళ్లీ సిమెంటు రోడ్డు నిర్మాణానికి రూ.12,19,927.20 పైసలతో టెండర్‌ను కౌన్సిల్ ఆమోదించి నిధులు మంజూరు చేసింది. ఎమ్మెల్యే చినరాజప్ప ఇటీవలే ఈ రహదారికి శంకుస్థాపన చేశారు. స్టేషన్ సెంటర్ నుంచి సత్యనారాయణపురం వెళ్లే రహదారికి కనీసం తారు రోడ్డు వేయాలని ఆ ప్రాంత ప్రజలు కోరుతున్నారు. సత్యనారాయణపురానికి వచ్చే అధికారులు ఫ్లైఓవర్ మీదుగా రాక పోకలు సాగించడం వల్ల ఈ రోడ్డు కష్టాలు వారి తెలియడం లేదని పలువురు అంటున్నారు.

**నష్ట పరిహారం చెల్లించినా..**



సత్యనారాయణపురం రహదారి గోతులతో నిండిపోవడంతో రాత్రి వేళల్లో బహిరంగ మల విసర్జనకు వినియోగిస్తున్నారు. దాంతో విద్యార్థులతో పాటు కల్యాణ మండపానికి నడిచి వచ్చే వారు తీవ్ర ఇబ్బందులకు గురి అవుతున్నారు. మున్సిపల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేసి, ఎమ్మెల్యే దృష్టికి తీసుకు వెళతాం.

– వల్లే రవి, చిరు వ్యాపారి, సామర్లకోట

**అంచనాలు తయారు చేస్తాం**



రహదారి తవ్వకానికి సంబంధించి గ్యాస్ కంపెనీ నుంచి రూ.ఏడు లక్షలు నష్ట పరిహారంగా చెల్లించినట్లు గుర్తించాం. ఈ రోడ్డును పరిశీలించి అంచనాలు తయారు చేస్తాం. ఈ రోడ్డు సమస్యపై ఇప్పటి వరకు తమ దృష్టికి రాలేదు.

– ఎ.శ్రీవిద్య, మున్సిపల్ కమిషనర్, సామర్లకోట

### విద్యుత్తు సరఫరాకు నేడు అంతరాయం

సామర్లకోట: స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్‌లో మరమ్మతులను పురస్కరించుకుని శుక్రవారం ఉదయం ఏడు గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీ ఈపీ డీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు ఏఈఎన్‌డీఎస్ ప్రభాకర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మరమ్మతులలో భాగంగా బ్రౌన్‌పేట, సీతారామ కాలనీ, గణేష్ కాలనీ, తహసీల్దార్ కార్యాలయం, కుమ్మరవీధి, బోనాసువారి వీధి, పాత్రులపేట, కొత్త భీమవరపుపేట, చంద్రశేఖరస్వామి ఆలయం, పెద్ద బజార్, కోటపేట, బళ్లమార్కెట్, చిన్నవీధి, గాంధీచౌక్, బలుసులపేట, నీలమ్మ చెరువు,అయోధ్యరామపురం, అంబటివారితోట, ఇస్మాయిల్ నగర్, పెన్షన్‌లైన్, సంగీతరావుపేట, మఠం సెంటర్, సంపెంగతోట, కొత్తూరు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందన్నారు. వినియోగదారులు ఈ అసౌకర్యాన్ని గమనించాలన్నారు. అలాగే ఉండూరు, పి.వేమవరం, కాపవరం, గొంచాల, బ్రహ్మానందపురం, చంద్రంపాలెం, నవర, పవర, వికె రాయపురం గ్రామాలల్లో ఉదయం ఏడు గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్తు సరఫరా ఉండదని ఈఈ ప్రభాకర్ తెలిపారు.

# ఘనంగా నేతాజీ జయంతి

పిఠాపురం: భారత స్వాతంత్ర్య సమర యోధుడు నేతాజీ సుభాష్ చంద్ర బోస్ జయంతి వేడుకలు గురువారం నియోజకవర్గంలో ఘనంగా నిర్వహించారు. గొల్లప్రోలు జిల్లా ప్రజా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో నేతాజీ చిత్రపటానికి బీజేపీ నాయకులు చిట్టా మధు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా నాయకులు, మలిరెడ్డి నారాయణరావు, కర్రి సత్యనారాయణ, పాఠశాల చైర్మన్ పి.శ్రీను, పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు ప్రకాష్ ఉమా మంగతాయారు, విద్యార్థులు ఉపాధ్యాయులు, మేడసాని కామరాజు, గారపాటి సత్తిబాబు తదితర నాయకులు పాల్గొన్నారు.
స్థానిక బీజేపీ నాయకులు ఓలేటి వెంకటేశ్వరరావు, బుర్రి మురళీధరరావు, కర్నీడి తాతీలు, తోట ఏడుకొండలు తదితరులు పాత పోలీసు స్టేషన్ వద్ద ఉన్న నేతాజీ విగ్రహానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో పలువురు పట్టణ వాసులు పాల్గొన్నారు.



బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్‌లో నేతాజీకి నివాళులర్పిస్తున్న సిబ్బంది

**నేతాజీకి నివాళులు**

సామర్లకోట: నేతాజీ ఆశయాలు ఆదర్శనీయమని జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత తోటకూర సాయిరామకృష్ణ అన్నారు. నేతాజీ సుభాష్‌చంద్రబోస్ జయంతిని పురస్కరించు కొని స్థానిక బచ్చుఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్‌లో ఆయన చిత్రపటానికి పూలమాల వేసిన నివాళ్లు అర్పించారు. నేతాజీ చూపిన బాటలో ప్రతి ఒక్కరూ నడుచుకోవాలని రామకృష్ణ అన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



పిఠాపురంలో నేతాజీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న బీజేపీ నేతలు

# భవిత సేవలను సద్వినియోగం చేసుకోవాలి

పెద్దాపురం: విభిన్న ప్రతిభా వంతులకు ప్రభుత్వం భవిత సెంటర్ల ద్వారా అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని మండల విద్యాశాఖాధికారి వీఆర్‌కె చౌదరి అన్నారు. స్థానిక మహాత్మాగాంధీ మున్సిపల్ పాఠశాలలోని భవిత సెంటర్‌ను ఆయన గురువారం పరిశీలించి మాట్లాడుతూ విభిన్న ప్రతిభా వంతులకు విద్యా శాఖ ద్వారా పలు సంక్షేమ పథకాలు అమలు చేస్తోందన్నారు. సెంటర్ ద్వారా అర్బన్, రూరల్ పరిధిలో విభిన్న ప్రతిభా వంతుల విద్యార్థులకు మెరుగైన వైద్య, విద్య సౌకర్యం కల్పిస్తోందన్నారు. ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. అనంతరం ఒక విద్యార్థికి అందిస్తున్న ఫిజియోథెరపీ ప్రక్రియను, రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో భవిత ఉపాధ్యాయుడు దుర్గాప్రసాద్‌రెడ్డి, ఆనందరావు, పాఠశాల హెచ్‌ఎం శివజ్యోతి, ఫిజియోథెరపీ వైద్యులు అపర్ణ, భవిత సెంటర్ సిబ్బంది పాల్గొన్నారు.



భవిత సెంటర్‌లో ఫిజియోథెరపీ చికిత్సను పరిశీలిస్తున్న ఎంఈఓ

# అన్నవరం దేవస్థానానికి వీల్ చైర్ల వితరణ



సంక్షేమ శాఖ అందజేసిన వీల్‌చైర్లతో ఈఓ వీర్ల సుబ్బారావు

అన్నవరం: సత్యదేవుని ఆలయానికి వచ్చే వయోవృద్ధులు, వికలాంగుల సౌకర్యార్థం జిల్లా వికలాంగుల, వయోవృద్ధులు, ట్రాన్స్‌జెండర్స్ సంక్షేమ శాఖ 10 వీల్ చైర్లను గురువారం అందజేసింది. వీటిని స్వీకరించిన దేవస్థానం ఈఓ వీర్ల సుబ్బారావు వయోవృద్ధులు, వికలాంగుల కోసం వీటిని ఉపయోగించాలని ఆదేశించారు. దేవస్థానం పీఆర్వో డీవీ కృష్ణారావు పాల్గొన్నారు.

### లుసిడాలో లిప్సికకు ప్రథమ బహుమతి



బహుమతి అందుకుంటున్న లిప్సిక

సామర్లకోట: పిఠాపురం ఆర్సీహెచ్‌ఎస్ పాఠశాలలో జరిగిన జిల్లా స్థాయి లుసిడా (ఇంగ్లీషు హ్యాండ్ రైటింగ్) పోటీల్లో సామర్లకోట జిల్లా పరిషత్తు బాలికోన్నత పాఠశాలకు చెందిన విద్యార్థిని బి.లిప్సిక ప్రథమ బహుమతి గెలుచుకున్నట్లు పాఠశాల హెచ్‌ఎం యూ.మీనామాధురి గురువారం తెలిపారు. 8వ తరగతి చదువుతున్న ఆమె జిల్లా స్థాయిలో ప్రథమ బహుమతి సాధించడం తమకు ఎంతో ఆనందంగా ఉన్నదన్నారు. పిఠాపురంలో జరిగిన పోటీలకు జిల్లా సైన్సు అధికారులు బి.అబ్రహం హాన్స్, పి.వినిల్ న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారని చెప్పారు. ప్రథమ బహుమతి సాధించిన విద్యార్థిని లిప్సికను హెచ్‌ఎం, విద్యాకమిటీ వైస్ చైర్మన్ పి.లోవరాజు అభినందించారు.

# లైంగిక వేధింపుల నివారణపై అవగాహన



బాలలపై లైంగిక వేధింపులు జరుగుతున్న తీరును నాటిక ద్వారా ప్రదర్శిస్తున్న కళాశాల విద్యార్థినులు

కరప: బాలలపై లైంగిక వేధింపులు ఎక్కువ అవుతున్నాయని, పాఠశాలల్లో ప్రత్యేక సమావేశాలు నిర్వహించి విద్యార్థులకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని పడాల చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు పడాల సూర్యప్రసాద్ అన్నారు. తమ ట్రస్ట్ ద్వారా నాటికల రూపంలో విద్యార్థులకు అర్థమయ్యేలా ప్రచారం చేస్తున్నట్టు ఆయన వివరించారు. స్థానిక మండల ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో గురువారం పాఠశాలల హెచ్‌ఎంలు, గ్రామ కార్యదర్శులతో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎంఈఓలు కె.బుల్లికృష్ణవేణి, పి.సత్యనారాయణ, ఈఓపీఆర్డీ ఎస్‌వీ శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యార్థులు మొబైల్‌ఫోన్, ట్యాబ్‌లలో ఏమి చూస్తున్నారో తల్లిదండ్రులు పర్యవేక్షించాలని, చదువుకు సంబంధించిన అంశాలు తప్ప, మిగిలిన వెబ్‌సైట్‌లు చూడకుండా అవగాహన కల్పించాలన్నారు. మాయ మాటలతో బాలలను ఎలా లోబరచుకుంటున్నదీ, జరుగుతున్న లైంగిక వేధింపులు, మోసాలను వివరించి, ఉపాధ్యాయులు తమ పాఠశాలల్లోని విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. రిసోర్స్‌పర్సన్లు కరీముద్దీన్, జి.ఉమాదేవి, ఎం.విజయలక్ష్మి లైంగిక వేధింపులు, బ్యాడ్ టచ్, గుడ్ టచ్, పోక్సో చట్టం గురించి వివరించారు. పడాల చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కళాశాల విద్యార్థినులు వి.సంధ్య త్రిలోచన, ఎం.లక్ష్మీదేవి, రమ్య, నివేదితలు సురక్షితమైన స్పర్శ, అసురక్షిత స్పర్శ, జరుగుతున్న లైంగికవేధింపులు, భద్రతా నియమాలు, ఆపదలో చిక్కుకున్నప్పుడు ఎలా తప్పించుకోవాలి, రక్షణకు 1098కు ఎలా ఫోన్‌చేయాలో బొమ్మలు ప ట్టుకుని నాటక రూపంలో ప్రదర్శించి, అవగాహన కల్పించారు.

### రైలు నుంచి జారి పడిన వ్యక్తికి చికిత్స

కాకినాడ క్రైం: పెద్దాపురానికి చెందిన 60 ఏళ్ల వి.సత్తిబాబు బుధవారం రాత్రి సామర్లకోట రైల్వేస్టేషన్‌లో రైలు దిగుతూ జారిపడ్డాడు. అతడికి తీవ్రగాయాలు కావడంతో స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్చారు. మెరుగైన చికిత్స కోసం గురువారం సత్తిబాబును కాకినాడ జీజీహెచ్‌లో చేర్చారు.

# ఉమర్ ఆలీషాకు ఘన నివాళులు

కాకినాడ రూరల్: పిఠాపురంలో విశ్వ విజ్ఞాన విద్యాధ్యాత్మిక పీఠం 6వ పీఠాధిపతి కవి శేఖర డాక్టరు ఉమర్ ఆలీషా 6వ వర్ధంతిని కాకినాడలో గురువారం ఘనంగా నిర్వహించారు. సర్పవరం జంక్షన్‌లోని బోట్‌క్లబ్ ఉద్యానవం వద్ద ఉన్న కవి శేఖర ఉమర్ ఆలీషా విగ్రహానికి ప్రస్తుత పీఠాధిపతి ఉమర్ ఆలీషా సోదరులు అహ్మద్ ఆలీషా, హుస్సేన్ షా, విశ్రాంత ఆర్టీఓ చిక్కం రామచంద్రరావు, పీఠం కన్వీనర్ పేరూరి సూరిబాబు తదితరులు పూల మాలలు నివాళులర్పించారు. పేరూరి సూరిబాబు అధ్యక్షతన జరిగిన సభలో అహ్మద్ ఆలీషా, హుస్సేన్ షా మాట్లాడుతూ కవి శేఖర ఉమర్ ఆలీషా బహుముఖ ప్రజ్ఞాశాలిగాను, బహు భాషా కోవిదుడిగాను, ఉత్తమ పార్లమెంటేరియన్ పేరొందారన్నారు. 50 గ్రంథాలు రచించి మౌల్వీ బిరుదును, అకాడమీ ఆఫ్ అమెరికా వారిచే డైరెక్టర్ ఆఫ్ లిటరేచర్ బిరుదును పొందారన్నారు. స్వాతంత్ర్య ఉద్యమంలో భాగంగా సహాయ నిరాకరణ ఉద్యమంలో పాల్గొన్నారన్నారు. కవి శేఖర ఉమర్ ఆలీషా విశిష్టతను పీఠం సభ్యుడు రామకృష్ణ కీర్తనల రూపంలో పాడి అలరించారు. కార్యక్రమంలో కవి డాక్టర్ వేదుల శిరీష, స్థానిక పీఠం కన్వీనర్లు మండా ఎల్లమాంబ, కాకినాడ లక్ష్మి, చిర్ల వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



ఉమర్ ఆలీషా విగ్రహానికి నివాళులర్పిస్తున్న అహ్మద్ ఆలీషా, హుస్సేన్ షా తదితరులు

### సీహెచ్‌సీకి ఏసీ బహూకరణ

సామర్లకోట: స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రానికి నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జి విత్తనాల వెంకటరమణ గురువారం ఏసీని బహూకరించారు. ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప చేతుల మీదుగా ఆస్పత్రి ఇన్‌చార్జి వైద్యాధికారి అమలకు ఏసీని అందజేశారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ గోలి వెంకట అప్పారావుచౌదరి, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ మాజీ చైర్మన్ అడబాల కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.



సామర్లకోట సీహెచ్‌సీకి ఏసీ బహూకరించిన వెంకటరమణ

# ఆడేద్దామా పికిల్ బాల్..

- చిన్ననాటి అట్ట బంతాట తర్వాత వెర్షన్!
- టీటీని, టెన్నిస్‌ని కలిపి కొత్త క్రీడకు రూపం
- అంతర్జాతీయంగా ప్రాచుర్యం పొందుతున్న వైనం
- అన్ని వయస్సుల వారు సులభంగా ఆడుకునే వెసులుబాటు



పికిల్‌బాల్ ఆడుతున్న క్రీడాకారులు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): ఆటలు ఆరోగ్యానికి మేలు చేస్తాయి. కొంత ఒత్తిడిని కూడా పెంచుతాయి. అయితే ఒత్తిడి లేకుండా ఉల్లాసంగా ఆడుకునే క్రీడగా ఇటీవల కాలంలో అంతర్జాతీయంగా ప్రాచుర్యం పొందిన క్రీడ పికిల్ బాల్. చిన్నప్పుడు అట్టతో ప్లాస్టిక్ బంతిని కొడుతూ అటు ఇటు ఆడుకునే ఆట ఆధునిక వెర్షన్ ఈ పికిల్ బాల్. టెన్నిస్ ఆడాలంటే పెద్ద కోర్టుతో పాటు ఎక్కువ శక్తి, సామర్థ్యం కావాలి. ఇది పూర్తిగా ఔట్‌డోర్ క్రీడ. ఇక టేబుల్ టెన్నిస్ రాకెట్‌తో ఆడతారు. చిన్న బంతి ఉంటుంది. ఇది పూర్తిగా ఇండోర్ గేమ్. ఈ రెండు రాకెట్ గేమ్ ఆటలను సమన్వయం చేస్తూ బ్యాడ్మింటన్ కోర్టు మాదిరిగా ఉండే కోర్టులో ఆడే క్రీడే పికిల్ బాల్. ఈ క్రీడను అటు ఇండోర్‌లోను.. ఇటు ఔట్‌డోర్‌లోనూ ఎలాంటి ఒత్తిడి లేకుండా చిన్నపిల్లల నుంచి వృద్ధుల వరకు ఎవరైనా ఆడవచ్చు. అందుకే ఈ క్రీడ ప్రస్తుతం అంతర్జాతీయంగా ప్రాచుర్యం పొందుతోంది.

**ఆసక్తి ఎందుకంటే..?**

సింగిల్స్‌తో పాటు జట్టుగా ఆడేందుకు వీలుగా పికిల్‌బాల్‌ను రూపొందించారు. ఆట నియమాలు కూడా సరళంగా ఉంటాయి. నేర్చువడం చాలా సులభం. ఈ క్రీడలో గాయాలు కావడానికి తక్కువ అవకాశం ఉండడంతో విశ్రాంత ఆటగాళ్లు దీని వైపు ఆకర్షితులవుతున్నారు. టెన్నిస్ నెట్ మాదిరి గానే ఉండటంతో ఒత్తిడి లేదు. ప్లాస్టిక్‌తో తయారు చేసిన బంతి కావడంతో సర్వీస్ చేయడం కూడా సులభం. టేబుల్ టెన్నిస్ లాగే బంతి తమ కోర్టులో పడిన తర్వాతే ఆడాలి కాబట్టి అధిక ఒత్తిడి ఉండదు. చెక్కతో తయారైన రాకెట్ కాస్త పెద్దగా ఉండడంతో పిల్లలు కూడా సులభంగా ఆడగలరు. కుటుంబం, స్నేహితులతో కలిసి ఆడటానికి అనువైన ఆట. శారీరక శ్రమ, మానసిక ప్రశాంతత, సామాజిక పరస్పర చర్యలు ఈ క్రీడకు దోహదం చేస్తుంది. ఈ కారణాల వల్ల పికిల్‌బాల్ చాలా మందికి ఇష్టమైన క్రీడగా మారుతోంది.

**ఆడేది ఇలా..**

20 ఇంటూ 40 అడుగుల విస్తీర్ణంలోని కోర్టును నెట్ రెండు సమాన భాగాలుగా విభజిస్తుంది. నెట్ భూమి నుంచి 34 అంగుళాల ఎత్తులోనే ఉంటుంది. 17 అంగుళాల పొడవు చెక్కతో చేసిన బ్యాట్‌ను పాడిల్ అంటారు. బాల్ వ్యాసం సైతం 2.87 అంగుళాలే. బ్యాడ్మింటన్ మాదిరిగానే క్రాస్ కోర్టులో పడే విధంగా బంతిని ఆడతారు. సర్వీస్ అండర్ హ్యాండ్ స్ట్రోక్‌తోనే ప్రారంభమౌతుంది. సర్వీస్ చేసిన వారికే పాయింట్ వస్తుంది. లేకుంటే సర్వీస్ మారుతుంది. సరదాగా ఆడితే 11 పాయింట్లు, టోర్నీల్లో అయితే 15-21 పాయింట్లు. విజయానికి రెండు పాయింట్లు సరిపోతుంది.

**ఒత్తిడి లేని క్రీడ**



చిన్నారుల నుంచి పెద్దవారి వరకు ఈ ఆట ఆడుకునే అవకాశం ఉంది. కీళ్ల నొప్పులు ఉన్న వారు సైతం టోర్నీలో పాల్గొనేంత సులభంగా ఆట సాగుతుంది. ఇది ప్రపంచ వ్యాప్తంగా ప్రజాదరణ పొందుతున్న ఆధునిక క్రీడ. తక్కువ స్థలంలో ఆడగలిగే ఈ క్రీడ అన్ని వయస్సుల వారికి ఆనందాన్నిస్తుంది.


డీఎస్‌డీఓ శ్రీనివాస్ కుమార్




పికిల్ బాల్ కోర్టు కొలతలు



పికిల్ బాల్ రాకెట్లు



ఆటకు వినియోగించే బాల్స్

### చొల్లంగి తీర్థం ఏర్పాట్ల పరిశీలన



మొండి వద్ద స్నానాల రేవును పరిశీలిస్తున్న అధికారులు

కరప: మండలం ఉప్పలంక శివారు మొండివద్ద ఈ నెల 29వ తేదీన జరిగే చొల్లంగి అమావాస్య తీర్థానికి చేయాల్సిన ఏర్పాట్లపై అధికారులు క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఏయే ఏర్పాట్లు ఎక్కడెక్కడ ఏమిచేయాలో చర్చించారు. స్నానాలరేవును పరిశీలించి భక్తులకు అసౌకర్యం కలగకుండా చేయాల్సిన పనులు, కల్పించాల్సిన భద్రత విషయాలను, మహిళలు దుస్తులు మార్చుకునేందుకు వసతి, స్నానాలరేవులో గజ ఈతగాళ్ల ఏర్పాటు, పోలీసు బందోబస్తు నిర్వహణపై చర్చించారు. సంగమేశ్వరస్వామి, కాలభైరవస్వామి, ఆంజనేయ, సీతారాముల ఆలయాల వద్ద క్యూలైన్ల ఏర్పాటు, బందోబస్తు ఎలాచేయాలి, చర్చించి, చేయాల్సిన విధివిధానాలపై నిర్ణయాలు తీసుకున్నారు. తీర్థం రోజున బందోబస్తు ఏర్పాటు చేసి, భక్తులకు ఇబ్బంది లేకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్టు అధికారులు తెలిపారు. ఎంపీడీఓ ఎం.అనుపమ, ఎంఎస్ఎన్ చారిటీస్ ఏసీ కె.విజయలక్ష్మి, తహసీల్దార్ ఎన్.సత్యనారాయణ, ఎస్ఐ టి.సునీత, ఈఓపీఆర్డీ ఎస్‌వీ శ్రీనివాసరావు, గ్రామ కార్యదర్శులు ఎం.భవాని, పి.వీరభద్రరావు, బొమ్మిడి సతీష్ తదితరులు పాల్గొన్నారు.